

## రూ.50 వేల విరాళం


ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి రాజుల పురుషోత్తమ్‌రెడ్డి, విమల దంపతులు గురువారం రూ.50 వేల విరాళం సమర్పించారు.



## లింక్ క్లిక్ చేస్తే బుక్ అయినట్టే!

సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, వాట్సాప్ వేదికగా సైబర్ కేటుగాళ్లు చెలరేగిపోతున్నారు. ఆఫర్లు, ప్రయోజనాలు, డిస్కౌంట్ల పేరుతో లింకులను క్లిక్ చేయమంటున్నారు. -8లో▸

## డెల్టాలకు నీటి విడుదల పెంపు



ధవళేశ్వరం: స్థానికంగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం నీటి విడుదలను పెంచారు. తూర్పు డెల్టాకు 2,500, సెంట్రల్‌కు 1,900, పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

## న్యూస్‌రీల్

### అరాచక పాలనను రాష్ట్రపతి, ప్రధాని దృష్టికి తీసుకువెళ్తాం



మాజీ ఎంపీ మార్గాని

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో సాగుతున్న అరాచక పాలనను త్వరలో రాష్ట్రపతి, ప్రధాని దృష్టికి తీసుకుని వెళ్తామని రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. రాజమహేంద్రవరంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 45 రోజులుగా రావణ కాష్టంలా సాగుతున్న రాజకీయ హత్యలు, అరాచక పాలనపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వీడియో క్లిప్పింగులు, ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. దీనికి సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్‌తో పాటు వివిధ పార్టీల నేతలు మద్దతు తెలిపారన్నారు. చంద్రబాబు అరాచక పాలనను ప్రజలు గమనిస్తున్నారని, తొందరలోనే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. టీడీపీ సాగిస్తున్న రాజకీయ హత్యలను వెంటనే నిలుపు చేయాలని డిమాండ్ చేశారు.

### రాజమహేంద్రవరం కమిషనర్‌గా కేతన్ గర్గ్



కలెక్టర్ ప్రశాంతికి మొక్క అందిస్తున్న నూతన కమిషనర్ కేతన్ గర్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ కమిషనర్‌గా కేతన్ గర్గ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాజస్థాన్‌కు చెందిన ఆయన 2018 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. విజయనగరంలో సహాయ కలెక్టర్‌గా, ట్రైనీ కలెక్టర్‌గా, రాజంపేటలో సబ్ కలెక్టర్‌గా పని చేశారు. అనంతపురం జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, ఎస్‌ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానింగ్ ఆఫీసర్ జీవీఎస్ఎస్ మూర్తి, వెంకట రమణ, ఇతర అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కేతన్ గర్గ్ కలెక్టర్ పి.ప్రశాంతిని కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు.

### జాబ్ మేళాలకు కార్యాచరణ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా 8 మెగా, 8 మినీ జాబ్ మేళాలు నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా స్థాయి కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ మేళాల ద్వారా 13 వేల మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలోని ఒక్కో నైపుణ్య కేంద్రం ద్వారా ఏటా 240 మంది నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ కేంద్రాల్లో శిక్షణ పొందిన 1,680 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యం పెంచుతామని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు ఏపీ ఎస్ఎస్‌డీసీ ద్వారా ఇంజినీరింగ్ కళాశాలల్లో పరిశ్రమల డిమాండ్‌పై సర్టిఫికేషన్ కోర్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు.

# తమ్ముళ్లకు కొత్త టెన్షన్

- నామినేటెడ్ పదవులపై ఆశలు
- ఎంపికలో చంద్రబాబు మార్కు రాజకీయం
- ఐవీఆర్ఎస్ సర్వే ఫలితాల ప్రకారమే పీఠాలు
- తాజాగా మరో ఫీలర్
- నియోజకవర్గంలో గెలిచిన పార్టీ నేతలకే కట్టబెడతామని సంకేతాలు
- ఎన్నికల్లో కష్టపడిన వారి ఆశలపై నీళ్లు



సాక్షి, రాజమహేంద్రవరం: 'ఏరు దాటేవరకు ఏటి మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న' అన్న చందంగా మారింది సీఎం చంద్రబాబు నాయుడి వ్యవహార శైలి. సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గట్టెక్కాలనే ఉద్దేశంతో అలవిగాని హామీలు ఇచ్చేశారు. టీడీపీకి కార్యకర్తలు, నాయకులే ముఖ్యమని, ప్రభుత్వం ఏర్పడితే పార్టీకి వారు చేసిన సేవలకు అనుగుణంగా నామినేటెడ్ పదవుల్లో నియమిస్తామని చంద్రబాబు, నారా లోకేష్ వివిధ సందర్భాల్లో ఎర వేశారు. ఎక్కువ కేసులు ఉన్న వారికి మరింత ప్రాధాన్యం ఇస్తామని నమ్మించారు. దీంతో తమ్ముళ్లు కూడా ఎన్నికల్లో 'బాగానే' కష్టపడ్డారు. టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో తమకు నామినేటెడ్ పదవులు వరిస్తాయని వారు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. బయోడేటాలు సైతం సిద్ధం చేసుకుంటున్నారు. సరిగ్గా ఇదే తరుణంలో వారి ఆశలపై సీఎం చంద్రబాబు నీళ్లు జల్లారు. టీడీపీ నిర్వహించే ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవీఆర్ఎస్) సర్వేలో ఉత్తముడని తేలితేనే పదవి కట్టబెడతామంటూ ఇస్తున్న సంకేతాలతో ఆశావహుల్లో ఒక్కసారిగా అలజడి మొదలైంది.

**ప్రతి నియోజకవర్గంలో ఐదుగురిపై సర్వే**

ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే టికెట్లు దక్కని వారికి, క్రియాశీల పాత్ర పోషించిన వారికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చేందుకు టీడీపీ అధిష్టానం ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. రాష్ట్ర స్థాయి పదవుల జాబితాలు ఇప్పటికే సిద్ధమైనట్లు సమాచారం. ఈ నెలాఖరు లేదా వచ్చే నెల మొదటి వారంలో దాదాపు 20 నుంచి 25 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించే అవకాశం ఉంది. వీటితో పాటు మిగిలిన పదవులకు స్థానిక ఎమ్మెల్యేల సిఫారసుతో పాటు సర్వే ద్వారా ఎంపిక చేస్తున్నారు. నియోజకవర్గ, పార్లమెంటరీ, గ్రామ స్థాయి పదవులకు సంబంధించి ఒక్కో నియోజకవర్గంలో ఐదుగురిపై సర్వే చేస్తున్నారు. పార్టీ శ్రేణులకు, ప్రజలకు నేరుగా ఫోన్లు చేసి, ఎస్ఎంఎస్, లింక్ ద్వారా నామినేటెడ్ పదవి ఆశిస్తున్న వారిపై అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ఎవరైతే బాగుంటుందని ఆరా తీస్తున్నారు. ఈ పరిణామం ఆశావహుల్లో ఆందోళన కలిగిస్తోంది. పార్టీ కోసం లక్షలాది రూపాయలు నీళ్లప్రాయంలా ధారపోస్తే నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వకుండా కొత్తవారికి కట్టబెట్టాలని చూడటమేమిటంటూ అధినేత చంద్రబాబు తీరును ఎండగడుతున్నారు. ఐదేళ్లు పార్టీకి ఖర్చు పెట్టి, జెండా మోసేందుకు తాము.. పదవులు అనుభవించేందుకు ఇతరులు కావాలా అంటూ అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు.

**మీకింత.. మాకింత..**

తాజాగా మరో లీకు వదిలారు. టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి నుంచి ఆయా నియోజకవర్గాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ నేతలకే 60 శాతం పదవులు కట్టబెడతామని చెబుతున్నారు. మిగిలిన దానిలో 30 శాతం తర్వాతి కూటమి పార్టీకి, మరో 10 శాతం బీజేపీకి కేటాయిస్తామని అంటున్నారు. దీని ప్రకారం టీడీపీ ఎమ్మెల్యేలు ఉన్న చోట ఆ నియోజకవర్గ పరిధిలోని 60 శాతం నామినేటెడ్ పోస్టులు ఆ పార్టీ వారికే దక్కుతాయి. 30 శాతం జనసేనకు, 10 శాతం బీజేపీకి కేటాయిస్తారు. జనసేన ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో 60 శాతం ఆ పార్టీ కార్యకర్తలకు, 30 శాతం టీడీపీకి, 10 శాతం బీజేపీకి దక్కుతాయి. ఈ మేరకు మూడు పార్టీల మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు సమాచారం. దీంతో ఆయా నియోజకవర్గాల నుంచి నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న టీడీపీ నాయకులకు గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది. పార్టీ విజయానికి అహర్నిశలూ కష్టపడిన వారిని స్వయంగా గుర్తించాల్సింది పోయి ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా ఎంపిక చేస్తామనడం ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు. పోనీ అన్ని పదవులూ తమకే వస్తాయనుకుంటే.. కొత్త ప్రతిపాదనతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని ఆవేదన చెందుతున్నారు. మరోవైపు ఈ పరిణామం బీజేపీ నేతల్లో ఆగ్రహావేశాలు నింపుతోంది. జాతీయ పార్టీ నేతలకు 10 శాతం సీట్లు మాత్రమే కేటాయించడంపై గుర్రుగా ఉన్నారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి టీడీపీకి దాసోహం కావడంతోనే ఈ దుస్థితి తలెత్తిందని విమర్శలు గుప్పిస్తున్నారు.

**శేషారావుకు పోటీ!**

టీడీపీ – జనసేన – బీజేపీ పొత్తులో భాగంగా నిడదవోలు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఎమ్మెల్యే సీటు గల్లంతైంది. దీనిని జనసేన **నేత కందుల దుర్గేష్‌కు కేటాయించారు. దీనిపై అప్పట్లో అనుచరులతో కలిసి శేషారావు ఆందోళన బాట పట్టారు. ఆయనను చంద్రబాబు పిలిపించుకుని దుర్గేష్‌తో సయోధ్య కుదిర్చారు. ఆ సమయంలో ఎమ్మెల్సీ ప**దవి ఇస్తానని శేషారావుకు బాబు హామీ ఇచ్చారు. ఇంత వరకూ బాగానే ఉన్నా.. ప్రస్తుతం ఆయనతో పాటు మరో నేత పేరు కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆ నేత పేరుతో అభిప్రాయ సేకరణ జరుగుతూండటంతో శేషారావుకు పదవి దక్కడంపై మీమాంస నెలకొంది. దీనికి తోడు శేషారావు వర్గానికి సైతం పూర్తి స్థాయిలో పదవులు దక్కే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి.

**చౌదరికి భంగపాటేనా?**

రాజానగరంలో టీడీపీ అభ్యర్థి బొడ్డు వెంకట రమణ చౌదరికి మొండిచేయి చూపారు. ఈ సీటును జనసేన నుంచి బత్తుల బలరామకృష్ణకు కేటాయించారు. ఎన్నికల సమయంలో చౌదరికి ప్రభుత్వంలో కీలక పదవి ఇచ్చి గౌరవిస్తానని స్వయంగా చంద్రబాబే ప్రకటించారు. అసలే పదవి ఇస్తారు, ఎప్పుడిస్తారనే ప్రశ్న చౌదరి వర్గంలో తలెత్తుతోంది. దీనికి తోడు రాజానగరం మండలానికి చెందిన జనసేన నేతకు మరో పదవి కట్టబెట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరమైనట్లు తెలిసింది. ఇక్కడ జనసేన ప్రాతినిధ్యం వహిస్తూండటంతో 60 శాతం పదవులన్నీ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వర్గానికే దక్కనున్నాయి. దీంతో తమకు మరోసారి భంగపాటు తప్పదేమోననే సంశయం చౌదరి వర్గాన్ని వెంటాడుతోంది.

**గన్ని కృష్ణకు గౌరవం దక్కేనా?**

రాజమహేంద్రవరం నగరంలో టీడీపీ సీనియర్ నేత గన్ని కృష్ణ గతంలో గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (గుడా) చైర్మన్‌గా పని చేశారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్మన్ పదవిపై ఆయన ఆశలు పెట్టుకున్నారు. దీనిపై ఆయన చంద్రబాబు వద్ద పావులు కదుపుతున్నట్లు సమాచారం. అయితే, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, గన్ని కృష్ణ వర్గాల మధ్య విభేదాలున్నాయి. దీంతో వాసు మద్దతు ఉండదని గన్ని కృష్ణ వర్గీయులు భావిస్తున్నారు. దీనికి తోడు గన్ని కృష్ణతో పాటు మరొకరి పేరును కూడా ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రస్తావిస్తున్నట్లు సమాచారం. ఇదే జరిగితే గన్ని కృష్ణకు పరాభవం తప్పదనే భావన పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది.

### టీడీపీ దాడుల్లో బాధితులకు ఆర్థిక సాయం



మారెళ్లమూడిలో భేతాళదాసుకు చెక్కు అందిస్తున్న మాజీ మంత్రి వనిత

నల్లజర్ల: ఎన్నికల ఫలితాల అనంతరం దూబచర్ల, ఘంటావారిగూడెం, పుల్లలపాడు, మారెళ్లమూడి గ్రామాల్లో టీడీపీ అల్లరి మూకలు చేసిన దాడుల్లో గాయపడిన బాధితులను మాజీ హోం మంత్రి తానేటి వనిత గురువారం పరామర్శించారు. మారెళ్లమూడిలో రేషన్ వ్యాన్ ధ్వంసం చేసి, యజమాని భేతాళదాసుపై టీడీపీ అల్లరి మూకలు దాడి చేసి గాయపరిచాయి. అంతేకాకుండా ఆయనపై తప్పుడు కేసు పెట్టి 12 రోజుల పాటు సబ్ జైలుకు పంపాయి. మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ విషయం తెలియడంతో భేతాళదాసుకు రూ.లక్ష ఆర్థిక సాయం మంజూరు చేశారు. ఆ చెక్కును పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత దాసుకు అందజేశారు. అలాగే ఘంటావారిగూడెంలో టీడీపీ అల్లరి మూకలు వాటర్ సర్వీసింగ్ సెంటర్‌ను ధ్వంసం చేసి, యజమాని ఈబిచర్ల ప్రభాకరావును గాయపరిచాయి. ఆయనకు కూడా వనిత రూ.లక్ష చెక్కు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

### 31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

రాజమహేంద్రవరం రూరల్: పాలిసెట్ తుది దశ కౌన్సెలింగ్ ముగిసిన తరుణంలో మిగిలిన సీట్లను స్పాట్ అడ్మిషన్ల కోటాలో ఈ నెల 31న భర్తీ చేయనున్నారు. బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ ప్రక్రియ జరుగుతుందని ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై, పాలిసెట్‌లో పాసయిన, రాయని విద్యార్థులు దీనికి అర్హులన్నారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్ (సీఎంఈ) 4, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ (ఈసీఈ) 1, మెకానికల్ ఇంజినీరింగ్ (డీఎంఈ) 17 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 31న వ్యక్తిగతంగా హాజరు కావాలని సూచించారు.

## 'ఎర్ర కాలువ'పై కేంద్రానికి ప్రతిపాదనలు

### కలెక్టర్ ప్రశాంతి ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఎర్ర కాలువ సమస్య పరిష్కారంపై కేంద్రానికి పంపించేందుకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఈ అంశంపై ఇరిగేషన్ అధికారులతో తన క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎర్ర కాలువ వరదలతో జిల్లాలోని నల్లజర్ల, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం తదితర మండలాల్లోని పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, రహదారులు కోతకు గురవుతున్నాయని అన్నారు. ఈ సమస్యకు పూర్తి పరిష్కారం చూపేందుకు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ద్వారా కేంద్రానికి పంపించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఏలూరు ఇరిగేషన్ ఎస్‌ఈ సీహెచ్ దేవప్రకాశరావును ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులు మాట్లాడుతూ, ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం వద్ద 4.42 టీఎంసీల సామర్థ్యంలో ఎర్ర కాలువ ప్రాజెక్టు ఉందని తెలిపారు. అధిక వర్షాలు, వరదల సమయంలో 17 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదలడంతో నల్లజర్ల, నిడదవోలు, దేవరపల్లి తదితర మండలాల్లోని పొలాలు నీట మునిగి రైతులకు పంట నష్టం జరుగుతోందని వివరించారు. ఎర్ర కాలువ ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. తాటిపూడి ఎత్తిపోతల పథకంలో అధిక వర్షాలకు గట్లు తెగిపోవడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నామని, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధులు మంజూరు చేయాలని తాడిపూడి డీఈ, పి.బాలకృష్ణ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనికి కలెక్టర్ ప్రశాంతి అంగీకారం తెలిపారు. సమావేశంలో ఏలూరు ఇరిగేషన్ డీఈ కె.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## గోదారమ్మ దోబూచులు

- ధవళేశ్వరం వద్ద 13.40 అడుగులకు తగ్గిన గోదావరి
- భద్రాచలం వద్ద స్వల్పంగా పెరుగుదల
- కాటన్ బ్యారేజీ వద్ద నేడు మళ్లీ పెరిగే అవకాశం



కాటన్ బ్యారేజీ నుంచి విడుదల చేస్తున్న మిగులు జలాలు

ధవళేశ్వరం: వరద గోదావరి తగ్గుతూ, పెరుగుతూ దోబూచులాడుతోంది. ధవళేశ్వరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద నీటి ఉధృతి గురువారం తగ్గుముఖం పట్టగా ఎగువన భద్రాచలంలో మళ్లీ పెరుగుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఉదయం 6 గంటలకు 13.90 అడుగులుగా ఉన్న నీటిమట్టం ఉదయం 9 గంటలకు 13.70 అడుగులకు తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. అనంతరం వరద ఉధృతి క్రమేపీ సాయంత్రం 6 గంటలకు 13.40 అడుగులకు తగ్గింది. బ్యారేజీలోని ధవళేశ్వరం, ర్యాలి, మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌లలో మొత్తం 175 గేట్లను పైకి లేపి, 12,30,242 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. దీంతో ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. అయితే భద్రాచలం వద్ద నీటి ఉధృతి మళ్లీ పెరగడంతో మధ్యాహ్నం మరోసారి రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. సాయంత్రం 6 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 48.60 అడుగులుగా నమోదైంది. ఈ ప్రభావంతో కాటన్ బ్యారేజీ వద్ద నీటి ఉధృతి కొంత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, ఎగువ ప్రాంతాలైన కాళేశ్వరం, పేరూరు, దుమ్ముగూడెం వద్ద నీటిమట్టాలు తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో భద్రాచలం వద్ద కూడా వరద ఉధృతి తగ్గే అవకాశం ఉంది.

**వివిధ ప్రాంతాల్లో గోదావరి నీటిమట్టాలు (మీటర్లు)**

| | |
|---|---|
| కాళేశ్వరం | 11.06 |
| పేరూరు | 16.36 |
| దుమ్ముగూడెం | 13.21 |
| భద్రాచలం | 48.60 (అడుగులు) |
| కూనవరం | 20.14 |
| కుంట | 11.50 |
| పోలవరం | 12.90 |
| రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి | 16.62 |

● కౌలుకోనిస్తారా!

# పరపతి పాట్లు



**అధికారంలోకి వచ్చిన తర్వాత 'అన్నదాత సుఖీభవ' పథకం కింద ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ నయా పైసా సాయం అందించనే లేదు. పైగా ఈ పథకంపై ఇప్పటి వరకూ స్పష్టంగా ఒక్క** ప్రకటన కూడా చేయలేదు. దీంతో సాగు పెట్టుబడుల కోసం పలువురు రైతులు ఇప్పటికే వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. దీనికి తోడు కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు (సీసీ ఆర్‌సీ) కూడా ఇప్పటి వరకూ పూర్తి స్థాయిలో అందజేయలేదు. దీంతో ప్రస్తుత ఖరీఫ్‌లో కౌలు రైతులు సాగు పెట్టుబడి కోసం నానా పాట్లూ పడుతున్నారు.

- కౌలు రైతులకు పూర్తి స్థాయిలో అందని సీసీఆర్‌సీలు
- ఉమ్మడి 'తూర్పు'న ఇచ్చినవి 40 శాతమే
- సాగు పెట్టుబడికి వడ్డీ వ్యాపారుల చుట్టూ కౌలుదార్ల ప్రదక్షిణలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా సాగు చేస్తున్న రైతుల్లో 70 నుంచి 80 శాతం కౌలుదార్లే ఉన్నారు. వీరికి ఏ చిన్న కష్టం వచ్చినా గతంలో ఆదుకునే నాథుడే ఉండేవారు కాదు. భూమిపై హక్కు లేకపోవడంతో బ్యాంకుల్లో అప్పు పుట్టేది కాదు. దీంతో వీరు సాగు పెట్టుబడుల కోసం బయట వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చేది. ఇలా అప్పోసొప్పో చేసి.. ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుని పంట పండించాక.. ఏ ప్రకృతి విపత్తులో సంభవిస్తే కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి దమ్మిడీ సాయం కూడా అందేది కాదు. ప్రభుత్వం అందించే పరిహారం భూమి యజమానిగా ఉన్న రైతుకే దక్కేది. దీంతో పెట్టుబడి దక్కక కౌలు రైతులు ఎంతో నష్టపోయేవారు. వీరి ఇబ్బందులను గుర్తించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా సీసీఆర్‌సీల మంజూరుకు శ్రీకారం చుట్టి, పకడ్బందీగా అమలు చేసింది. దీనివలన కౌలు రైతులకు సాగు పెట్టుబడికి అవసరమైన అప్పు బ్యాంకుల్లో లభించేది. అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో తీసుకునే వీలుండేది. అంతే కాదు.. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు పంట నష్టం జరిగితే కౌలు రైతుకు కూడా ఈ గుర్తింపు కార్డు ద్వారానే పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ అందించేవారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఏటా పంట సాగు హక్కు పత్రాలు పక్కాగా జారీ చేసి, కౌలు రైతులకు భరోసాగా నిలిచేవారు. సీజన్ మొదలైన వెంటనే ఎటువంటి జాప్యం లేకుండా రెవెన్యూ, వ్యవసాయ శాఖల సమన్వయంతో అర్హత కలిగిన ప్రతి కౌలు రైతుకూ కౌలు గుర్తింపు కార్డులు అందజేసేవారు. దీనిపై భూ యజమానులైన రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి 11 నెలల కాలానికి వారి నుంచి అనుమతి పత్రాలు తీసుకునే వారు. తద్వారా కార్డులు జారీ వేగంగా పూర్తి చేసేవారు.

**60 శాతం కౌలుదార్ల ఎదురుచూపులు**

గత ఎన్నికల్లో టీడీపీ – జనసేన – బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఖరీఫ్ సాగు ప్రారంభమైంది. తొలకరి పంట కాలం మొదలై అప్పుడే రెండు నెలలు గడచిపోయింది. ఈపాటికే కౌలు రైతులకు పూర్తి స్థాయిలో సాగు గుర్తింపు కార్డులు అందించాల్సి ఉండగా.. ఉమ్మడి జిల్లాలో ఈ ప్రక్రియ నత్త కంటే నెమ్మదిగా సాగుతోంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరి దాదాపు రెండు నెలలవుతున్నా ఉమ్మడి జిల్లాలో 60 శాతం కౌలు రైతులకు ఇప్పటికీ కార్డులు అందలేదు. పైగా వారి గోడు వినేవారే లేకుండా పోయారు. దీంతో మిగిలిన కౌలు రైతులు పరపతి కోసం అనేక పాట్లు పడుతున్నారు. ఇప్పటికే నాట్లు పూర్తి చేసిన వారికి సైతం కార్డులు అందలేదు. వీరిలో చాలా మంది ఇప్పటికే కమీషన్ ఏజెంట్ల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తీసుకోవాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. సీజన్ ప్రారంభమయ్యేసరికే కౌలు రైతు గుర్తింపు కార్డులుంటే వారికి ఏదో ఒక బ్యాంక్ నుంచి రుణం లభిస్తుంది. ప్రస్తుతం ఆ కార్డులు లేకపోవడంతో సాగు పెట్టుబడి కోసం ఏ బ్యాంకుకు వెళ్లినా కౌలు రైతులకు రిక్తహస్తమే ఎదురవుతోంది. కౌలు గుర్తింపు కార్డుల జారీలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తూ తమను రోడ్డున పడేస్తోందని వారు దిగులు చెందుతున్నారు. సీజన్ ముగిసిపోయినా కార్డులు వచ్చేలా కనిపించడం లేదని అంటున్నారు.

**గడచిన ఐదేళ్లుగా జారీ చేసిన కౌలు రైతు గుర్తింపు కార్డులు**

| జిల్లా | 2019–20 | 2020–21 | 2021–22 | 2022–23 | 2023–24 |
|---|---|---|---|---|---|
| కాకినాడ | 30,673 | 36,795 | 44,580 | 41,322 | 56,399 |
| కోనసీమ | 47,845 | 53,240 | 57,830 | 62,243 | 68,230 |
| తూర్పు గోదావరి | 32,868 | 46,073 | 57,308 | 67,442 | 97,266 |

**ప్రస్తుత ఖరీఫ్‌లో కౌలు రైతు గుర్తింపు కార్డుల జారీ ఇలా..**

| జిల్లా | లక్ష్యం | మంజూరు |
|---|---|---|
| కాకినాడ | 68,890 | 27,833 |
| కోనసీమ | 77,000 | 23,000 |
| తూర్పు గోదావరి | 1,09,450 | 52,391 |
| మొత్తం | 2,55,340 | 1,03,224 |

### జారీలో జాప్యం



కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఖరీఫ్ సీజన్‌లో సాగుకు సిద్ధమైనా ఇంతవరకూ కౌలు గుర్తింపు కార్డులు అందించ లేదు. ఇది పెట్టుబడులు పెట్టాల్సిన సమయం. కౌలు గుర్తింపు కార్డులు ఉంటేనే బ్యాంకుల నుంచి రుణ పరపతి అందుకోగలుగుతాం. ఇంత వరకూ కౌలు గుర్తింపు కార్డుల ఊసే లేదు. వీటిని తక్షణమే అందజేసి సాగుకు సాయపడాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చేవారు.

– తోరం బ్రహ్మాజీ, కౌలు రైతు, సీతానగరం మండలం

### పెట్టుబడికి ఇబ్బంది



ఖరీఫ్ నారుమళ్లు కూడా పూర్తయ్యాయి. ఇప్పుడిప్పుడే నాట్లు వేసుకుంటున్నాం. పెట్టుబడి అవసరం ఎంతో ఉంది. ఎకరాకు తొలి విడతగా ఎంత తక్కువ లెక్కేసినా రూ.20 వేలు పైనే అవుతుంది. ఈ సమయానికి కూడా కౌలు గుర్తింపు కార్డులు విడుదల కాకుంటే బ్యాంకులు రుణ పరపతి ఎలా ఇస్తాయి? పెట్టుబడి కోసం ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం చొరవ తీసుకుని కౌలు గుర్తింపు కార్డులు త్వరగా విడుదల చేయాలి.

– నన్నపు బ్రహ్మానందం, కౌలు రైతు, దుళ్ల, కడియం మండలం

## క్లుప్తంగా

### 4న పవర్ లిఫ్టింగ్ - బెంచ్‌ప్రెస్ పోటీలు

**రాజమహేంద్రవరం రూరల్: తూర్పుగో**దావరి జిల్లా పవర్ లిఫ్టింగ్ **అసోసియేషన్** ఆధ్వర్యంలో ఆగస్టు నాలు**గవ తేదీన బొ**మ్మూరు నేతాజీనగర్ ఐద**వ వీధిలో శ్రీసా**యిపవర్ జిమ్‌లో పవ**ర్‌లిఫ్టింగ్–బెంచ్** ప్రెస్ పోటీలు నిర్వహిస్తున్నట్టు సార్వత్రిక కార్యదర్శి డీవీవీ సత్యనారాయణ ప్రకటనలో తెలిపారు. పురుషుల విభాగంలో 59, 66, 74, 83, 93+కిలోల విభాగం, మాస్టర్స్‌లో 40 నుంచి 50 వయసు, 50 నుంచి 60 వయసు విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. వయసు నిరూపణ తప్పనిసరన్నారు. మహిళల విభాగంలోను పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు. పోటీలలో పాల్గొనే అభ్యర్థులు రెండురోజులు ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలకు 94928 28302 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

### 29న నిధి ఆప్‌కే నిఖత్

**రాజమహేంద్రవరం రూరల్:** రాజమహేంద్రవరం ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈ నెల 29వ తేదీన ఉదయం 9.00 గంటల నుంచి నిధి ఆప్‌కే నిఖత్-డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 వైడీ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో వెలుగుబంద గైట్ ఇంజినీరింగ్ కళాశాలలోను, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లాలో మురమళ్ళ పీఏసీఎస్ లోను, కాకినాడ జిల్లాలో కాకినాడ కాశేశ్వరి రిఫైనరీలోను, ఏలూరు జిల్లాలో తాడేపల్లిగూడెంలో ఎన్‌కే ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్‌లోను, పశ్చిమగోదావరి జిల్లాలో యండగండి పీఏసీఎస్‌లోను, అల్లూరి సీతారామరాజు జిల్లాలో వై.రామవరం మండలం చవిటిదిబ్బలు పీహెచ్‌సీలోను, గంగవరం మండలం గంగవరం సీహెచ్‌సీలోను, మారేడుమిల్లి పంచాయతీ కార్యాలయంలోను నిధి ఆప్‌కే నిఖత్ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ నిధి ఆప్‌కే నిఖత్‌లో పారిశ్రామిక ప్రమాదాలు, పీఎఫ్ సభ్యత్వ సమస్య, పీఎఫ్ సభ్యత్వం కొనసాగింపు, ఉద్యోగ మార్పుతో పీఎఫ్ ఉపసంహరణ, ప్రతికూల ప్రభావాల ప్రయోజనాలు, పేరు సవరణ, బ్యాంకు ఖాతా సీడింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని, యూనిఫైడ్ మెంబర్ పోర్టల్ సేవలు అందిస్తారన్నారు. పీఎఫ్ సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్‌మెంట్‌లు ఈ ప్రోగ్రామ్‌ను ఉపయోగించుకోవాలన్నారు.

# లింక్ క్లిక్ చేస్తే బుక్ అయినట్టే!

- కాకినాడ ఇంద్రపాలెంలో సెలూన్ నిర్వహిస్తున్న వీరు అనే యువకుడికి గుర్తు తెలియని నంబర్ నుంచి ఓ లింక్ వచ్చింది. సెలూన్ ప్రొడక్ట్స్ డిస్కౌంట్ సేల్ అన్నది ఆ లింక్ సారాంశం. క్లిక్ చేయగానే ఒక్కసారి ఫోన్ బ్లింక్ అయింది. ఏం జరుగుతోందో ఆ యువకుడికి అర్థం కాలేదు. అసాధారణంగా వైబ్రేట్ అయింది. కాసేపటికి ఆఫ్ అయిపోయింది. నిమిషం ఆగి మళ్లీ ఆన్ అయింది. హ్యాకర్లు వీరు ఫోన్ డేటా చోరీ చేసి మార్ఫింగ్ ఫొటోలతో డబ్బు కావాలంటూ బెదిరించడం మొదలు పెట్టారు. లబోదిబోమంటూ ఆ యువకుడు పోలీసులను ఆశ్రయించాడు.
- పెద్దాపురానికి చెందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు సైబర్ ఉచ్చులో చిక్కుకున్నారు. ఆయన ఫేస్‌బుక్‌ను హ్యాక్ చేసిన కేటుగాడు, ఫొటోలు సేకరించి మహిళల ఫొటోలను అసభ్యంగా మార్ఫింగ్ చేశాడు. ఫేక్ చాటింగ్ స్క్రీన్ షాట్లు తయారు చేసి వీర్రాజును బ్లాక్ మెయిల్ చేయడం మొదలు పెట్టాడు. తాను చెప్పిన వ్యాపారంలో పెట్టుబడి పెట్టాలని డిమాండ్ చేస్తూ భారీ మొత్తం డిమాండ్ చేశాడు. హ్యాకర్ వేధింపులు తాళలేక వీర్రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఓ ప్రభుత్వ ఉద్యోగిని ఆన్‌లైన్ ఆఫర్ల పేరుతో చేసిన మోసానికి బలయ్యారు. తక్కువ ధరలకే చీరలు అన్న యాడ్‌కి ఆకర్షితురాలయ్యారు. మెసేజ్‌లో వచ్చిన లింక్‌ను క్లిక్ చేశారు. అంతే ఆమె ఫోన్ హ్యాక్ అయింది. గూగుల్ పే నుంచి మూడు దఫాలలో మొత్తం రూ.27,400 మొత్తం చోరీకి గురైంది. స్థానిక జేఎన్‌టీయూలో పనిచేస్తున్న తన భర్తతో కలిసి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- జిల్లాలో విస్తరిస్తున్న సైబర్ నేరాలు
- సామాజిక మాధ్యమాల్లో గడుపుతున్న వారికి ముప్పు
- జనాల్లో కొరవడిన చైతన్యం
- కేసుల నమోదుకు పోలీసుల వెనకడుగు




ఫేస్‌బుక్ హ్యాక్‌పై పెద్దాపురం పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు (ఫైల్)

**కాకినాడ క్రైం:** సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం, వాట్సాప్ వేదికగా సైబర్ కేటుగాళ్లు చెలరేగి పోతున్నారు. ఆఫర్లు, ప్రయోజనాలు, డిస్కౌంట్ల పేరుతో లింకులను క్లిక్ చేయమంటున్నారు. క్లిక్ చేసిన మరుక్షణం డేటా చోరీకి పాల్పడి అమాయకుల జీవితాలను అతలాకుతలం చేస్తున్నారు. అటువంటి నేరాలే తాజాగా కాకినాడ జిల్లాలోని పలు ప్రాంతాల్లో చోటు చేసుకుంటున్నాయి. అయితే బాధితుల విషయంలో పోలీసులు ఓ సారూప్యతను గుర్తించారు. మోసపోయిన వారంతా సామాజిక మాధ్యమాలలో ఎక్కువ సమయం గడిపుతున్నవారే కావడం గమనార్హం. గతంలో సైబర్ మోసాలు అర్బన్ ప్రాంతాలకే పరిమితం అయ్యేవనీ, కానీ ఇటీవల కాలంలో ఇంటర్నెట్ ఉండి సోషల్ మీడియా చైతన్యం ఉన్న ప్రతి ప్రాంతంలోనూ ఈ మోసాలు పరిపాటిగా మారిపోయాయని పోలీసులే చెబుతున్నారు.

**అవగాహన కల్పించడంలో విఫలం**

ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా తగిన స్థాయిలో అవగాహన కల్పించడంలో పోలీసులు విఫలం అవుతున్నారు. ప్రతి నెలా పదుల సంఖ్యలో సైబర్ నేరాలు నమోదవుతున్నా అవగాహనపై దృష్టి సారించడంలో పోలీస్ శాఖ తగిన చొరవ చూపడం లేదు. స్టేషన్ల పరిధిలో సైబర్ నేరాల నమోదుకు అవకాశం కల్పించినా ఎస్‌హెచ్‌వోలు ఆ ఫిర్యాదుల స్వీకరణకు వెనకడుగు వేస్తున్నారు. ఎఫ్ఐఆర్ పడితే విచారణ, దర్యాప్తు బాధ్యతలు నెత్తికెత్తుకోవాలి. ఈ కారణంతోనే కేసు నమోదుకు ఎస్‌హెచ్‌వోలు వెనకాడుతున్నారని ఓ విశ్రాంత సీఐ తెలిపారు. సైబర్ నేరగాళ్లు ఎక్కువగా ఉత్తర భారతదేశానికి చెందిన వారు ఉంటున్నారు. దక్షిణ భారత దేశంలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వేదికగా తమ నేర సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నారని పోలీసులు గుర్తించారు. వీరి జాడ తెలుసుకోవడం అంత సులువు కాదు. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసినా విచారణ కష్టమని భావించి కేసు నమోదు చేయడానికి పోలీసులు వెనకడుగు వేస్తుంటారని ఆయన అన్నారు. కేసుల నమోదుకు వెనకడుగు వేస్తున్నా పదుల సంఖ్యలో నమోదవుతున్నాయి. అయితే పరిష్కారమవుతున్న కేసుల సంఖ్య ఆశాజనకంగా లేదు. సైబర్ నేరాల నివారణ, నియంత్రణకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు లేదా వ్యవస్థలను నిర్వహించకపోవడమే అందుకు కారణం. సైబర్ కవచ్ పేరుతో కాకినాడలో ఏర్పాటు చేసిన సాంకేతికత ప్రయోజనాన్ని పోలీసులు ప్రజలకు అందించడంలో విఫలం అయ్యారు. మొబైల్‌ను స్కాన్ చేసి హానికారక యాప్‌లు తొలగించి సెల్‌ఫోన్ యూజర్లకు భద్రత కల్పించే ఈ యంత్రం ప్రయోజనంపై ప్రజల్లో చాలామందికి అవగాహన లేదు. రూ.లక్షల ఖరీదైన ఈ యంత్రాలు కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయం, దిశ పోలీస్ స్టేషన్, బస్టాండ్‌లలో ఏర్పాటు చేసినా ప్రయోజనాన్ని ప్రజలు అందుకోలేక పోతున్నారు.




### ఫిర్యాదు చెయ్యొచ్చు...

సైబర్ క్రైం బాధితులు తమ ఫిర్యాదును వివిధ అంచల్లో అధికారులకు సమర్పించవచ్చు. స్థానిక స్టేషన్ మొదలు రాష్ట్ర స్థాయి అధికారుల వరకు ఎవరికైనా తమ సమస్యను విన్నవించవచ్చు.

కాకినాడ జిల్లా సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ : 9440796514
టోల్ ఫ్రీ : 1930
స్టేట్ సైబర్ క్రైం గ్రీవెన్స్ ఆఫీసర్ : 83310 43255
మెయిల్ ఐడీలు :
addlspncrp_cid@appolice.gov.in
cybercrimes_cid@ap.gov.in

### 56 కేసులు

కాకినాడ జిల్లాలో నానాటికీ ఈ కేసుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. గడచిన ఏడాదిన్నర కాలంలో ఆరు త్రైమాసికాల వ్యవధిలో నమోదైన కేసుల వివరాలు..

| | |
|---|---|
| 2023 జనవరి నుంచి మార్చి వరకు | : 9 |
| 2023 ఏప్రిల్ నుంచి జూన్ వరకు | : 10 |
| 2023 జూలై నుంచి సెప్టెంబర్ వరకు | : 9 |
| 2023 అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు | : 11 |
| 2024 జనవరి నుంచి మార్చి వరకు | : 5 |
| 2024 ఏప్రిల్ నుంచి జూన్ వరకు | : 12 |

### సైబర్ నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు



జిల్లాలో సైబర్ నేరాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడతాం. ఫిర్యాదు అవకాశాలను మరింత విస్తరిస్తాం. పాంప్లెట్ల ద్వారా ప్రజల్ని చైతన్యం చేస్తున్నాం. అవగాహనా కార్యక్రమాలను కట్టుదిట్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. సైబర్ కవచ్ పనితీరు ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తాం. ప్రజల అప్రమత్తత ఈ నేరాల నియంత్రణకు సహకరిస్తుంది. జిల్లాలో ఏ మూల సైబర్ నేరం జరిగినా స్థానిక పోలీస్ స్టేషన్లో లేదా కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న క్రైం స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

– విక్రాంత్ పాటిల్, ఎస్పీ, కాకినాడ జిల్లా

### ఇలా భద్రం...

- లింక్‌లు, అనవసర, అనుమానిత ప్రయోజనాల జోలికి వెళ్లొద్దు.
- యాప్స్ వినియోగించేటప్పుడు 'వైల్ యూసింగ్ దిస్ యాప్' ఆప్షన్‌ని మాత్రమే ఎంచుకోవాలి. ఆల్‌వేస్ అనే పర్మిట్‌ని సెలక్ట్ చెయొద్దు. అలా చేస్తే బ్యాక్ గ్రౌండ్‌లో యాప్ రన్ అవుతుంది. అప్లికేషన్ డెవలపర్ కూడా మీ డేటాను చోరీ చేసే అవకాశం ఉంది.
- కొత్త పేమెంట్ గేట్ వేల జోలికి వెళ్లొద్దు.
- ఈ కామర్స్ యాప్‌లు అయిన అమెజాన్, ఫ్లిప్ కార్డులలో పేమెంట్ ట్రాన్‌శాక్షన్‌లు చేసేటప్పుడు నేరుగా యాప్‌లోనే చేయాలి. బాహ్యంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం లాంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారంలలో వచ్చే యాడ్స్‌ని నమ్మొద్దు.
- గుర్తు తెలియని వ్యక్తి, నంబర్ లేదా అకౌంట్ నుంచి ఎటువంటి పలకరింపులు వచ్చినా స్పందించొద్దు.
- సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచార బదిలీకి తావివ్వొద్దు.
- నమ్మదగ్గ లేదా అవసరం ఉన్న లింకులు వచ్చినా వాటి విషయంలోనూ అప్రమత్తత మంచిది.

**లింక్‌ను చెక్ చేసుకోవాలి**

లింక్‌లో వాస్తవికతను గుర్తించేందుకు గూగుల్ బ్రౌజర్‌లోకి వెళ్లి వచ్చిన లింక్‌ను కాపీ చేసి పేస్ట్ చేయాలి. అనంతరం ఎక్స్‌టెండ్ యూఆర్ఎల్‌ని క్లిక్ చేసి అది ఏ వెబ్‌సైట్‌కి రీ డైరెక్ట్ చేస్తుందో గమనించాలి. డెస్టినేషన్ వెబ్‌సైట్‌లో డిస్క్రిప్షన్ చూసి, మనం కోరుకున్నదే అని నిర్ధారణ అయితేనే లింక్‌ను క్లిక్ చేసి ముందుకు వెళ్లాలి.

## హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష

**జగ్గంపేట:** స్థానిక శెట్టిబలిజపేటలో ఒక మహిళను కత్తితో నరికి హత్య చేసిన ఘటనలో నేరస్తుడికి పెద్దాపురం కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.వేయి జరిమానా విధించింది. జగ్గంపేట ఏఎస్ఐ నూకరాజు అందించిన వివరాల ప్రకారం ఈ ఘటన 2013లో జరిగింది. దీనిపై బుధవారం పెద్దాపురం ఏడవ అడిషనల్ సెషన్స్ జడ్జి తీర్పు వెలువరించారు. జగ్గంపేట శెట్టిబలిజపేటకు చెందిన వానశెట్టి సింహాచలం (47) తన భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకుని దానికి కారణం అదే ప్రాంతానికి చెందిన బత్తిన భవానీగా భావించాడు. దీంతో 2013, ఏప్రిల్ 11వ తేదీన భవానీ తన ఇంటిలో కుటుంబ సభ్యులతో భోజనం చేస్తుండగాసింహాచలం కల్లుగీసే కత్తితో దాడి చేసి హత్య చేశాడు. దీనిపై కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం బుధవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముత్యం జయరాజు వాదనలు వినిపించారు. జగ్గంపేట సీఐ లక్ష్మణరావు కేసును పర్యవేక్షించారు.

## నిధుల సాధనలో కూటమి విఫలం

- కోనసీమ రైల్వే లైన్‌కు ఇచ్చింది రూ.300 కోట్లే
- అవి కూడా గత ప్రభుత్వంలో సాధించినవే
- మాజీ ఎంపీ చింతా అనురాధ



చింతా అనురాధ

**సాక్షి అమలాపురం:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెటులో రాష్ట్రానికి నిధులు సాధించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ విమర్శించారు. అమలాపురంలో ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన కోనసీమ రైల్వే ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.300 కోట్లు కేటాయించడం గొప్ప విషయం కాదని అన్నారు. గత ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషితో కేంద్ర ప్రభుత్వం రూ.300 కోట్లు కేటాయించిందని అన్నారు. ఇప్పుడు కూడా అవే నిధులు చూపించారన్నారు. కేంద్ర ప్రభుత్వం టీడీపీ జనసేన ఎంపీల మద్దతుతో నడుస్తున్నా నిధులు సాధించలేక పోయారని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కోటిపల్లి రైల్వే లైనుకు అత్యధికంగా నిధులు వచ్చాయన్నారు. 2014 -2019 టీడీపీ కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న సమయంలో ఐదేళ్లలో కేవలం రూ.1,035 కోట్లు నిధులు కేటాయిస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఐదేళ్ల హయాంలో రూ.1,496 కోట్లు సాధించిందని అనురాధ తెలిపారు. అమరావతి రాజధానికి రూ.15 వేల కోట్లు ఇచ్చింది కేవలం అప్పుగా మాత్రమేనని ఆమె అన్నారు. కేంద్రంలో భాగస్వామ్యంగా ఉన్న బిహార్‌కు అత్యధికంగా నిధులు మంజూరు చేసిన కేంద్రం ఆంధ్రాకు మాత్రం అప్పులు ఇచ్చిందని అనురాధ విమర్శించారు.

### విఘ్నేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.26,80,345

**అయినవిల్లి:** విఘ్నేశ్వరస్వామివారి హుండీ ఆదాయాన్ని జిల్లా దేవదాయశాఖ అధికారి డి.నాగమల్లేశ్వరరావు, ఆలయ తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం లెక్కించారు. 63 రోజులకు ఆలయం వద్ద ఏర్పాటు చేసిన హుండీల ద్వారా ఆదాయం రూ..25,70,643, అన్నదాన సత్రంలో ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.1,09,702 ఆదాయం మొత్తం రూ.28,80,345 లభించినట్లు ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. విదేశీ కరెన్సీ నోట్లు 11 లభించినట్లు తెలిపారు.

### చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

**కపిలేశ్వరపురం:** వివిధ ప్రాంతాల్లో చోరీకి పాల్పడిన కె.గంగవరం మండలం తామరపల్లికి చెందిన రేవు శ్రీనివాస్ అనే సాదే శ్రీనివాస్‌ను అంగర పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. అతను వివిధ కేసుల్లో దొంగిలించిన రెండు మోటారు సైకిళ్లను స్వాధీన పర్చుకున్నారు. అంగర ఎస్సై అందె పరదేశి కథనం ప్రకారం... కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి, మరిడమ్మ, దుర్గమ్మ, రామాలయంలోని హుండీలను పగులగొట్టి దొంగిలించిన రూ.1,740, కె.గంగవరం మండలం పాణింగపల్లిలోని కనకదుర్గ ఆలయంలోని హుండీ నుంచి దొంగిలించిన రూ.వేయి, మండపేట మండలం కేశవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీ నుంచి దొంగిలించిన రూ.వేయిని స్వాధీనపర్చుకున్నారు. నిందితుడిని ఆలమూరు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు ఎస్సై పరదేశి తెలిపారు.

## నీటి సమృద్ధి గ్రామాలకు ప్రణాళిక

**11 జిల్లాల అధికారుల శిక్షణలో ప్రిన్సిపాల్**



శిక్షణలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

**సామర్లకోట:** నీటి సమస్యలు లేని గ్రామాలు తయారు చేయడానికి అధికారులు అందరూ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరిసీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పు గోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని వివిధ శాఖల అధికారులకు మూడు రోజుల శిక్షణను గురువారం ఆయన ప్రారంభించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధిస్తే అభివృద్ధి చేకూరుతుందని కేంద్ర ప్రభుత్వం చెప్పిందన్నారు. ఈ లక్ష్యాలలో భాగంగా మూడు రోజుల పాటు నీటి వసతి కల్పన, పారిశుధ్యం మెరుగు పర్చడంపై శిక్షణ ఇస్తామని చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధి పేరుతో ప్రకృతి కలుషితం అయిందని తెలిపారు. దాంతో మానవాళికి ముంపు సమస్య ఏర్పడుతుందని భావించి కేంద్ర ప్రభుత్వ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అమలు చేయడానికి నిర్ణయించిందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు జీఎస్ శ్రీదేవి, పి. శ్రీనివాసరావు, వి.ప్రసాద్, వెంకటేశ్వర్లు, బి.ఆంజనేయులు, పద్మజ, నిహారికలు శిక్షణ నిర్వహించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(ఎన్ఐఆర్‌డీ) శిక్షణ పరిశీలకులు నాగరాజు, ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



### దాడి చేసిన ముగ్గురిపై కేసు

**నిడదవోలు రూరల్:** పాత గొడవల నేపథ్యంలో వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ గురువారం తెలిపారు. మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన మార్గాని దుర్గాప్రసాద్‌కు అదే గ్రామానికి చెందిన చిడిపి శ్రీనివాస్, చిడిపి సత్యనారాయణ, అడపా శ్రీనివాస్‌లకు పాత గొడవలు ఉన్నాయన్నారు. దీంతో ఈ నెల 24న తనపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

**తుని:** పిఠాపురం-గొల్లప్రోలు మధ్యలో రైలు నుంచి జారిపడి (40) ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని తుని జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ గురువారం తెలిపారు. రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న రైలు నుంచి జారిపడి వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడి ఒంటిపై స్కై బ్లూకలర్ జీన్ ఫ్యాంట్, స్లీవ్ లెస్ బనియన్ ఉన్నాయని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మారూఫ్ తెలిపారు.


### గుంటలో పడి వ్యక్తి మృతి



శ్రీనివాసరావు మృతదేహం

**అయినవిల్లి:** ప్రమాదవశాత్తు గోదావరి వరద గుంటలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై వి.రాజేష్‌కుమార్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం ఉదయం 11గంటలకు కొబ్బరికాయలు తీసుకువస్తానని పొలానికి వెళ్లిన అయినవిల్లి మండలం అయినవిల్లిలంక గ్రామానికి చెందిన గోడి శ్రీనివాసరావు(49) వరద గుంటలో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందాడు. గురువారం అటుగా వెళ్తున్న స్థానికులు అతని మృతదేహాన్ని చూసి బంధువులకు చెప్పడంతో అక్కడికి చేరుకున్నారు. మృతుడు బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతని మృతి వార్త విన్న విలపిస్తున్న చూపరులను కంటతడి పెట్టించింది. మృతుడికి భార్య లీలావతి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

### ప్రమాదవశాత్తూ కాలువలో పడి..



మృతుడు కాళహస్తి

**ఏలేశ్వరం:** మండలంలోని కంబాలపాలెం సమీపంలోని ఏలేరు కాలువలో పడి గురువారం ఒక వ్యక్తి మృతిచెందాడు. మర్రివీడు పంచాయతీ పరిధిలోని కంబాలపాలెం గ్రామానికి చెందిన ముంగర కాళహస్తి(57) కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలువలో పడి మృతిచెందాడు. మృతునికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. అమ్మాయిలకు వివాహాలు జరిగాయి. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### అన్నదమ్ములపై హత్యాయత్నం కేసు

**ఆత్రేయపురం:** మండలంలోని ర్యాలి గ్రామంలో సరిహద్దు తగాదాల నేపథ్యంలో అన్నదమ్ములు కర్రలు, గునపాలతో ఒకరిపై ఒకరు గురువారం దాడి చేసుకున్నారు. దీంతో ఇరువర్గాలపై వచ్చిన ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ర్యాలి గ్రామానికి చెందిన పువ్వల రామకృష్ణ, సత్యనారాయణ అన్నదమ్ములు. తమ్ముడు సత్యనారాయణ ఇంటి ముందు అన్న రామకృష్ణ సిమెంట్ స్తంభం నిర్మించేందుకు యత్నించడంతో ఈ వివాదం రేగింది. ఇద్దరూ తిట్టుకుని కర్రలు, గునపాలతో పరస్పరం దాడి చేసుకున్నారు. స్వల్పంగా గాయపడిన ఇద్దరూ కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

## జీవ వైవిధ్య సౌందర్యం

- తీర ప్రాంతానికి రక్షణ కవచంగా కోరింగ మడ అడవులు
- నేడు వరల్డ్ మంగ్రూవ్స్ డే
- కోరంగి రానున్న వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్



కోరంగిలో విస్తరించి ఉన్న మడ అడవులు

**తాళ్లరేవు:** దేశంలో తూర్పు నదీ తీర పరీవాహక ప్రాంతంలో నెలకొన్న మడ అడవులు(మాంగ్రూవ్స్) జీవ వైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. దేశంలో కోల్‌కతాలోని సుందర్‌బన్స్ తరువాత కోరంగి మడ అడవులు రెండవ స్థానాన్ని ఆక్రమించాయి. 235.70 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి బంగాళాఖాతానికి ఆనుకుని ఉన్న కోరంగి మడ అటవీ ప్రాంతాన్ని వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972 ప్రకారం కోరింగ వైల్డ్ లైఫ్ శాంక్చురీగా ప్రకటించారు. కోరంగిలోని మడ అడవులు కాకినాడలోని పగడాలపేట వద్ద ప్రారంభమై తాళ్లరేవు, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలం పండి, పోర, ఎస్.యానాం వరకు దాదాపు 75 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. ముఖ్యంగా గోదావరి నది గౌతమి, వైనతేయ, వశిష్ఠ పాయలుగా విడిపోయి సముద్రంలో కలిసే తీర ప్రాంతంలో ఈ మడ అడవులు వ్యాపించి ఉన్నాయి. ఆయా నదుల నుంచి నీరు సముద్రంలో కలిసే ప్రాంతంలో మడ అడవులు విస్తారంగా పెరుగుతాయి. మడ అడవులు ప్రత్యక్షంగా పశుగ్రాసం, వంట చెరకు వంటి ప్రయోజనాలను చేకూర్చడంతోపాటు పరోక్షంగా మత్స్య సంపద అందిస్తాయి. తుపానులు, వరదల నుంచి తీర ప్రాంత గ్రామాలకు, ప్రజలకు రక్షణ చేకూరుస్తున్నాయి. ఇక్కడి మొక్కలు ఔషధ గుణాలు కలిగి ఉంటాయి. అనేక జాతుల వన్యప్రాణులకు ఆశ్రయం కల్పిస్తున్నాయి. దూర తీరాల నుంచి వలస పక్షులు ఇక్కడకు వచ్చి సంతానోత్పత్తి చేయడం విశేషం. పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదం చేసే ఆలివ్ రిడ్లీ తాబేళ్లు, ఫిషింగ్ క్యాట్, ఇండియన్ స్మూత్ కోటెడ్ ఓటర్స్ ఆవాసంగా ఉంటాయి. కాలుష్యం, భూమి కోత, తుపాను తాకిడి, అడవులు నరికివేసి చేపలు, రొయ్యలు చెరువులు తవ్వడం వంటి చర్యల వల్ల మడ అడవులు క్రమేణా తరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో వాటి సంరక్షణకు ప్రభుత్వం పర్యావరణ అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసింది. మడ అడవులపై ఆధారపడకుండా సమీప గ్రామస్తులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కార్యకలాపాలను అందిస్తున్నారు. మడ అటవీ సంపదను కాపాడేందుకు ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం కోరంగి బయో డైవర్సిటీ సెంటర్‌లో జరిగే వరల్డ్ మంగ్రూవ్స్ డే కార్యక్రమానికి వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.